క్లుప్తంగా

విరాళం అందజేత



ఆర్మూర్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపకుడు గుజరాతీ నివేదన్ ఇటీవల లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1000 డాలర్ల(రూ. 84వేలు) విరాళాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో గుజరాతీ నివేదన్‌ను సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి అల్జాపూర్ రాజేశ్, కోశాధికారి నరేందర్, ప్రోగ్రాం చైర్మన్ దాచేపల్లి సంతోష్, మాజీ జోనల్ చైర్మన్ డీకే రాజేశ్, చేపూర్ గణేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఆర్మూర్‌టౌన్: కార్మిక శాఖలో సభ్యత్వం ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్డులు కలిగి ఉన్న వారు కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణకోసం దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ సంస్థ ప్రతినిధి సరోజ అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో 15రోజులపాటు కార్మిక శాఖ ఆధ్వర్యంలో న్యాక్ సంస్థ ద్వారా కార్మికులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సత్యం ఖాందేష్, దండుగుల వెంకటి, మక్కల సాయిలు, మక్కల సాయినాథ్, బండారి నరేశ్, భూమేశ్, మల్లేశ్, సాయిలు, మేతాబ్ సింగ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిన ధ్యాన సభ్యులు

ఆర్మూర్‌టౌన్: వరంగల్‌లో నిర్వహించిన అహింసాయుత మహాకరుణ మెగా శాఖాహార ర్యాలీ, ధ్యాన ఆత్మజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు పీఎస్ఎస్ఎం ఆర్మూర్ ధ్యాన సభ్యులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజర్ బొడ్డు దయానంద్, లక్ష్మణ్, శ్రీనివాస్, మిట్టపల్లి మల్లారెడ్డి, కూనింటి శేఖర్‌రెడ్డి, కిష్టయ్య, ప్రదీప్, దేవీదాస్ తదితరులు వరంగల్ వెళ్లినవారిలో ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీవీఎస్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా ప్రకాశ్, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఆసూరి గోవిందరాజులు, జాయింట్ సెక్రటరీలుగా టీవీ రవికాంత్, శరత్‌కుమార్, కోశాధికారిగా దయాసాగర్, ఆడిట్ అకౌంట్‌గా రామస్వామి, ప్రచారకార్యదర్శిగా రామ్‌మనోహర్, నరేంద్రస్వామి, కార్యవర్గ సభ్యులుగా వి భాస్కర్, నందకిశోర్, టి రవి, సురేందర్, రఘు, శ్రీనివాస్, ప్రవీణ్, లక్ష్మణ్ సుశ్రీత్, సత్యనారాయణ, సర్వ సమాజ్ ప్రతినిధిగా మానకొండూరు రవి నియమితులయ్యారు.

కాంగ్రెస్ పట్టణ జనరల్ సెక్రెటరీగా ఎస్‌కే పాషా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా ఎస్‌కే పాషా నియమితులయ్యారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేశ్, నాయకులు మాజీద్, జిమ్మీ రవి, బాల్‌కిషన్, పోశెట్టి, ఫయీం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

వేల్పూర్/కమ్మర్‌పల్లి: రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన యువకులతోపాటు పలువురు బీఆర్ఎస్‌లో ఆదివారం చేరారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాల్కొండ, మోర్తాడ్ మండలాలకు చెందిన 300 మంది యువకులతోపాటు మోర్తాడ్ మండల కేంద్రంలోని తక్కూరివాడలో వివిధ యువజన సంఘాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, దొన్కల్ మాజీ ఎంపీటీసీ లక్ష్మి, బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన 11 యువజన సంఘాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అభివృద్ధి చేసిన వేములకే మా మద్దతు అంటూ మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకుంటున్న యువకులు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. మానాల దేగావత్‌తండా, గైదీగుట్ట తండాల కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంగాధర్, లావుడ్య తిరుపతి తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బషీరాబాద్, చౌట్‌పల్లి, ఉప్లూర్, అమీర్‌నగర్ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, యువజన సంఘాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్ సైనికులు ప్రతి గడపకు వెళ్లాలి

- తల్లిలాంటి అన్నపూర్ణమ్మ ఆరోపణలు చేయడం తగదు
- నాకోసం 30రోజులు పనిచేయండి.. ఐదేళ్లు సేవ చేస్తా
- విస్తృతస్థాయి సమావేశాల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి వేముల

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్: సీఎం కేసీఆర్ సహకారంతో తాను బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని, ప్రతి గడపకూ వెళ్లి ఓట్లు అడగాలని బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే పదవికోసం తల్లిలాంటి అన్నపూర్ణమ్మ తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని, దిగజారి మాట్లాడడం సరికాదని అన్నారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో, భీమ్‌గల్‌లోని నింబాచల ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యకర్తలే తనకు బలమని, ఓటు అడగాల్సిన బాధ్యత వారిదేనని అన్నారు. 30 రోజులు తనకోసం కష్టపడి పనిచేస్తే, ఐదేండ్లపాటు మీకు సేవ చేస్తానని మంత్రి పేర్కొన్నారు. కార్యకర్తలు కష్టపడితే అన్ని ఓట్లు కారు గుర్తుకే పడతాయని, కాంగ్రెస్ మోసపూరితమైన హామీలతో వస్తోందని.. ప్రజలను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, గట్టు పొడిచిన వాగు ప్రాజెక్ట్‌ల సమస్యలను తీర్చి పంటలకు నీరందించి సస్యశ్యామలం చేశామని చెప్పారు. బాల్కొండ ప్రజలకు తనపై నమ్మకం, విశ్వాసం ఉందని భారీ మెజారిటీతో ఎన్నికల్లో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ మేనిఫెస్టోను గడపగడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కమ్మర్‌పల్లి మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వెనుకబడిన భీమ్‌గల్ ప్రాంతాన్ని వందల కోట్లతో మనసు పెట్టి అభివృద్ధి చేశానన్నారు. వేముగంటి ప్రాజెక్ట్ క్లియరెన్స్ తెచ్చి సాగునీటి గోస తీర్చానని, పల్లికొండ చెరువు నుంచి మిగతా చెరువులు నింపడానికి చైన్ ట్యాంక్ పైప్‌లైన్ పనులు కూడా పూర్తయ్యాయని అన్నారు. కప్పల వాగు మీద చెక్‌డ్యాములు నిర్మించి, ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా కాళేశ్వరం నీళ్లు రివర్స్ పంపింగ్ చేసి ప్యాకేజీ-21 ద్వారా మండలంలోని సుమారు 20 గ్రామాలకు సాగు నీరందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో హెల్త్ అండ్ ఫ్యామిలీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు రాజారాం యాదవ్, కోటపాటి నర్సింహానాయుడు, భాస్కర్‌యాదవ్, రేగుంట దేవేందర్, చిన్నారెడ్డి, శంకర్, స్వామి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న క్రైస్తవులు

కుల సంఘాల మద్దతు

వేల్పూర్: రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఆదివారం మండలంలోని పలు గ్రామాల కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. రామన్నపేట్ దేవాంగ సంఘం, కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ కుర్మ యాదవసంఘం సభ్యులు మంత్రిని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఏకగ్రీవ తీర్మానాలు చేసిన ప్రతులను ఆయనకు అందజేశారు. ఏకగ్రీవ తీర్మానాలు చేస్తూ, అభివృద్ధి కోసం వెన్నంటి ఉంటామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పలు కుల సంఘాల సభ్యులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. క్రైస్తవులు మంత్రిని ఆశీర్వదిస్తూ భారీ మెజారిటీతో విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బీజేపీకి ఒక అవకాశం ఇవ్వండి



ఇనాయత్‌నగర్‌లో మాట్లాడుతున్న అన్నపూర్ణ

కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీకి ఒక అవకాశం ఇచ్చి చూడాలని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పోడుభూముల గురించి మహిళలు, రైతులు పోరాటం చేస్తే లాఠీచార్జి చేయించిన ఘనత కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దక్కిందని విమర్శించారు. సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలకు అందించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో సంక్షేమ పథకాలను కేవలం బీఆర్ఎస్ నాయకులకే ఇచ్చుకుని సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పూటకో పార్టీ మారే కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కొత్తగా గ్యారంటీలు ఇస్తామని ముందుకు వస్తున్నారని, వాళ్లు గెలిస్తే ఒకటే పార్టీలో ఉంటామని ముందు గ్యారంటీ ఇచ్చాకే ప్రజల మధ్యలోకి రావాలని సవాల్ విసిరారు. ఇనాయత్‌నగర్ ఉపసర్పంచ్ భర్త కమ్మరి రాజేశ్వర్ బీజేపీలో చేరగా.. అన్నపూర్ణమ్మ ఆయనకు కండువా కప్పి స్వాగతించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్, ఇగుర్ల రవి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, మాజీ సర్పంచ్ భూమారెడ్డి, రాజన్న, భూమారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ఏలేటి అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరగా, వారికి అన్నపూర్ణమ్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మోహన్, మండల అధ్యక్షుడు నడిపి సాయన్న, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ



మాట్లాడుతున్న ముత్యాల సునీల్

భీమ్‌గల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ అన్నారు. మండలంలోని బడాభీమ్‌గల్, మెండోర గ్రామాల్లో సునీల్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లలో మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్ని పనులకు ఒకే కాంట్రాక్టర్‌ను పెట్టుకొని బాల్కొండ ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ.15వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందిస్తామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళల ఖాతాల్లో రూ.2500ల చొప్పున జమ చేస్తామని తెలిపారు. బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

బాల్కొండ/వేల్పూర్/భీమ్‌గల్: ముప్కాల్, వేల్పూర్, భీమ్‌గల్ మండలాలకు చెందిన పలువురు ముత్యాల సునీల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సునీల్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన వార్డు సభ్యుడు రాజన్నతోపాటు యువకులు, పడగల్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, విత్తన ధ్రువీకరణ కమిటీ డైరెక్టర్, మాజీ సొసైటీ చైర్మన్ కొట్టాల చిన్నారెడ్డి, భీమ్‌గల్ పట్టణానికి చెందిన వారితోపాటు, మండలంలోని మెండోరా, గంగరాయి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

బోధన్‌లో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ఆమేర్ ఇంటి నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్, రెంజల్ బేస్‌మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలు ఇంటికి చేర్చిందన్నారు. ఎమ్మెల్యే నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, మరోసారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సోహెల్, కౌన్సిలర్ దూప్‌సింగ్ నాయకులు నక్క లింగారెడ్డి, అబీద్, అబ్బగోని గంగాధర్‌గౌడ్, పూజారి లింగం, బాబా, గంగాధర్‌గౌడ్, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంద సంజీవ్, నాయకులు జయవర్ధన్‌గౌడ్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవీపేటలో ప్రచారం..

నవీపేట : మండల కేంద్రంలోని దర్యాపూర్, సుభాష్‌నగర్‌కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నర్సింగ్‌రావు, నాయకులు తెడ్డు పోశెట్టి, సూరిబాబు, నవీన్‌రాజ్, దేవరాజ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం పేరుతో మోసగిస్తే చర్యలు



బోధన్: డివిజన్‌లోని కొందరు నాయకులు తాము మాలమహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులమని సంఘ సభ్యులను అయోమయానికి గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు ఉంటాయని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మోహన్‌రావు అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన మోహన్‌రావును ఆదివారం పట్టణంలో డివిజన్ ప్రతినిధులు సన్మానించారు. మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, మచ్కూరి దేవేందర్, ప్రతినిధులు కారం స్వామి, నీరడి ఈశ్వర్, సాలెన్ సంజీవ్, రాహుల్, సాయిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి

వర్ని (మోస్రా): తొమ్మిదిన్నరేళ్లలో చేపట్టిన అభివద్ధి పనులను ప్రజలకు వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలోని గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దిన ఘనత శ్రీనివాసరెడ్డికే దక్కిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. ఉమ్మడి వర్ని మండల ఇన్‌చార్జి పోచారం రవీందర్‌రెడ్డి, మోస్రా జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం వద్ద జాతీయ రహదారి నంబర్ 44పై ఎస్ఎస్ టీము సభ్యులు ఆదివారం వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు, బంగారు ఆభరణాలు ఉంటేసీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు అధికారులతో సహకరించాలని కోరారు. మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట ఘనత బీజేపీదే



సాలూరలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బోధన్/బోధన్‌టౌన్/రెంజల్(బోధన్): బీసీలకు పెద్దపీట వేసిన ఘనత బీజేపీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. బోధన్‌పట్టణంతోపాటు సాలూర, రెంజల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. బోధన్‌లోని 28వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆశ వర్కర్ బాలహంస చికిత్స కోసం ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించడాన్ని హర్షిస్తూ సాలూరలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ మండలశాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. రెంజల్ గ్రామానికి చెందిన పలువురు యువకులు మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా, వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, నాయకులు మోహన్, వాసు, సాలూర మండల అధ్యక్షుడు గోనె ప్రవీణ్, రెంజల్ మండల నాయకులు గోపీకృష్ణ, శ్రీనివాస్, బుజ్జి, సంతోష్, యోగేశ్, కరణ్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీలు



యువకులకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న తూము శరత్‌రెడ్డి

బోధన్‌టౌన్ (బోధన్): కాంగ్రెస్ నాయకులు పట్టణంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. అందరి సంక్షేమం కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. అనంతరం 18వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సాకేత్‌వర్మ పలువురు యువకులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్, ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఖలీం, నాయకులు ప్రమోద్, బిహారీ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు మోసపోవద్దు



పార్టీలో చేరినవారితో ఎంపీ అర్వింద్, రాకేశ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు ప్రజలు మోసపోవద్దని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్, గోవింద్‌పేట్ గ్రామాల్లో రాకేష్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పట్ల ప్రజలు చూపిస్తున్న ఉత్సాహాన్ని చూస్తుంటే గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత తనదన్నారు. అనంతరం చేపూర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మండల అధ్యక్షుడు రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు..

మాక్లూర్: మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎంపీ అర్వింద్, బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ జెడ్పీటీసీలు, మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఓడ్డెన్న, కల్లెడి సర్పంచ్ లావణ్యాప్రసాద్‌గౌడ్, ముత్యంపల్లి సర్పంచ్ ముద్దాల మల్లయ్యతోపాటు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. మదన్‌పల్లి, మాదాపూర్, దుర్గానగర్ తండా, మాజీ సర్పంచులు హన్మాండ్లు, భోజన్న, నూర్‌సింగ్‌తోపాటు రాంచంద్రాపల్లి, మదన్‌పల్లి మాజీ ఎంపీటీసీలు చందర్‌నాయక్, సాయన్న బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు చిన్న ముత్తన్న, ధర్మోరా మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, బొంకన్‌పల్లి సంపత్‌రావు, మాదాపూర్ ఉపసర్పంచ్ సుంకరి గోపాల్ తదితరులు బీజేపీలో చేరగా, ఎంపీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సొంత మేనిఫెస్టోతో వస్తా

- బీఆర్ఎస్ నాయకుడు అమర్‌నాథ్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌బాబు

రెంజల్(బోధన్): బోధన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా సొంత మేనిఫెస్టోను రూపొందించి అమలు చేస్తానని బీఆర్ఎస్ నాయకుడు అమర్‌నాథ్‌బాబు అన్నారు. నవంబర్ 4వ తేదీన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్న ఆయన సాటాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీలో తన గళం వినిపిస్తానన్నారు. జిల్లాలోని ప్రధాన నీటి వనరైన ఎస్ఆర్ఎస్పీ ద్వారా ఉమ్మడి జిల్లా కంటే దిగువన ఉన్న కరీంనగర్, వరంగల్ జిల్లాల రైతులకే అధిక ప్రయోజనం చేకూరుతున్నదని అన్నారు. ఎస్ఆర్ఎస్పీని జిల్లా రైతులకే పరిమితం చేయాలని అన్నారు. ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరీ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తే లాభదాయకంగా మారుతుందని పేర్కొన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేక దృష్టిసారించలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి తనను అసెంబ్లీకి పంపితే కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో పనిచేసిన అనుభవంతో ముందుకు సాగుతానని అన్నారు.

పద్మశాలీలకు జీవితాంతం అండగా ఉంటా



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): పద్మశాలీలకు ఏ కష్టం వచ్చినా.. తన కష్టమనుకుని జీవితాంతం అండగా ఉంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పద్మశాలీ సామాజికవర్గంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేనేతల బతుకుచిత్రాన్ని మార్చడం కోసమే బతుకమ్మ చీరల పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని 50 గ్రామాల పద్మశాలి సంఘాలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే పెర్కిట్‌లో నిర్మించిన పద్మశాలి ఫంక్షన్‌హాల్‌కు రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. పద్మశాలీల సంక్షేమం కోసం పాటుపడుతున్న తనను ఎన్నికల్లో మళ్లీ దీవించాలని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, నాయకులు పండిత్ పవన్, సంజయ్‌సింగ్ బబ్లూ, పోల సుధాకర్, గోసుకొండ అశోక్, ఈరవత్రి రాజశేఖర్, దాసరి సునిల్, అంబల్ల శ్రీనివాస్, బోగ రమణ, పోతు నర్సయ్య, డిష్ రాము పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

గ్రామ దేవతలకు బోనాలు



రెంజల్(బోధన్): మండలంలోని బాగేపల్లి, కళ్యాపూర్ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి, కట్టమైసమ్మ, పోచమ్మ దేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులసంఘాల వారీగా గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామాభివృద్ధి కమిటీల ప్రతినిధులు, సర్పంచులు పాముల సాయిలు, కాశం నిరంజని, ఆయా గ్రామాల పెద్దలు, కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విఠలేశ్వరాలయంలో కాకడహారతి



రుద్రూర్: మండలకేంద్రంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున కాకడ హారతి ప్రారంభమైంది. ప్రతి ఏడాది ఆశ్వయుజ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు కాకడ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పుణ్యక్షేత్రమైన పండరీపూర్ సాంప్రదాయం ప్రకారం నెలరోజులపాటు కాకడహారతి నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు రామశర్మ తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 - లింగోచ్చా(తెలుగు) - 1.45, ఒక్కడే-1 (తెలుగు) - 4.45, మార్టిన్ లూథర్ కింగ్(తెలుగు) - 7.25, ఓటు (తెలుగు) - 10.30
- స్క్రీన్-2 - భగవంత్ కేసరి (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
- స్క్రీన్-3 - లియో (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
- స్క్రీన్-4 - మార్టిన్ లూథర్ కింగ్ (తెలుగు)-12.05, నాగేశ్వరరావు-3.10, 6.35, 10.00